క్లుప్తంగా

శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి విరాళం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న భవానీశంకర్ సోదరులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయానికి పలువురు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా నాగులాపల్లికి చెందిన మళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థంగా అతని కుమారులు భవానీశంకర్, చంద్రశేఖర్, డాక్టర్ హరి ప్రసాద్ శుక్రవారం రూ.లక్ష విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంటకోట స్వామి సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

మునగపాక: పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భీమిశెట్టి ఉమాశంకర్ కోరారు. తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన శరగడం వెంకటరెడ్డి నాయుడు దంపతులు శుక్రవారం పదో తరగతికి చెందిన 27 మంది విద్యార్థులకు రూ.5 వేల విలువ చేసే విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏకాగ్రతతో చదువుకుంటే పదిలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఇష్టపడి కష్టపడి చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మళ్ల అప్పలనాయుడు, ఉమా మహేశ్వరరావు, శరగడం చినరమణ తదితరులు పాల్గొన్నారు.

సంత వేలం పాట నేడు

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో వారపు సంత, డైలీ మార్కెట్, పశువుల కబేళాకు శనివారం ఉదయం 11.30 గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనేవారు ధరావతు సొమ్ము చెల్లించడంతో పాటు మిగిలిన ధ్రువపత్రాలు అందజేయాలని తెలిపారు.

గ్లకోమాను నిర్లక్ష్యం చేయొద్దు



కోటవురట్లలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటవురట్ల: గ్లకోమా వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని కంటి వైద్య నిపుణురాలు సంధ్య సూచించారు. గ్లకోమా వారోత్సవాలలో భాగంగా ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించారు. స్థానిక బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థులను పరీక్షించి మందులు అందించారు. డాక్టరు సంధ్య మాట్లాడుతూ గ్లకోమాను నిర్లక్ష్యం చేస్తే అంధత్వం వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఆరంభంలోని సమస్యను గుర్తించి తగు చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో కె.వి.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థ రసాయనాలతో మత్స్య సంపదకు నష్టం



మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం రూరల్: పరిశ్రమల రసాయన వ్యర్థ కాలుష్యం కారణంగా మత్స్య సంపదకు నష్టం కలుగుతుందని సీపీఎం అచ్యుతాపురం కన్వీనర్ రొంగలి రాము ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం పూడిమడక, కొండపాలెంలో మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి నేటికీ ఇవ్వలేదని వాపోయారు. ఫార్మా వ్యర్థాల వల్ల చేపల వేట సరిగా సాగట్లేదన్నారు. ఫార్మా కంపెనీల పైప్‌లైన్ ప్యాకేజీ రూ.1.25 లక్షలు నేటికీ అందలేదన్నారు. మత్స్యకార యువకులకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి కల్పించటం లేదని వాపోయారు. పూడిమడకలో పెట్రోల్ బంక్ తెరిపించి సబ్సిడీపై డీజిల్ ఇవ్వాలని కోరారు. సీపీఎం శాఖ కార్యదర్శి చేపల తాతయ్య, దేముడమ్మ, మండల కమిటీ సభ్యులు కూండ్రపు సోమునాయుడు, గనగళ్ల నూకరాజు, లక్ష్మి, గంటలమ్మ పాల్గొన్నారు.



అందమైన రేవుపోలవరం తీరం



మినీ కైలాస్‌గిరిపై శివపార్వతుల విగ్రహాలు



శిథిలమైన టూరిజం భవనం

తీరం.. ఘోరం

- అధ్వానంగా రేవుపోలవరం తీరం
- కనీస వసతులు కరువు
- శిథిలమైన టూరిజం భవనాలు
- మందుబాబులకు అడ్డాగా బీచ్
- పర్యాటకుల ఇబ్బందులు



తుప్పుపట్టిన కంటెయినర్ మరుగుదొడ్లు



పాడవుతున్న తాటి కాటేజ్

ఎస్.రాయవరం: ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలలు.. సూర్యకాంతిలో మిలమిల మెరిసే ఇసుక తిన్నెలు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటకుల మదిని దోచుకునే రేవుపోలవరం తీరం ఘోరంగా తయారైంది. ఇక్కడ భవనాలు, కాటేజీలు, ప్రహరీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



టూరిజం క్షేత్రంలో గుర్రపు స్వారీదారుడు

2014 టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత హోం మంత్రి వంగలపూడి అనిత సుమారు 8 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించి రేవుపోలవరం తీరంలో రూ.1.50 కోట్లతో టూరిజం అభివృద్ధి పనులు చేపట్టారు. అప్పటికే స్థానిక మత్స్యకారులు టూరిజానికి కేటాయించిన కొండపై మినీ కైలాస్ పేరుతో శివ పార్వతులు విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆ వెంటనే టూరిజం శాఖ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఆ విగ్రహాలకు తుది మెరుగులు దిద్ది ఆకృతులను అందంగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత పర్వతంపైకి రోడ్డు వేస్తామని గ్రావెల్ తవ్వి అడ్డదిడ్డంగా వదిలేశారు. కొండను ఆనుకుని స్టాల్ భవనం, సేద తీరేందుకు రెండు కాటేజీలు, వాటికి ఆనుకుని కంటైనర్ మరుగుదొడ్లు నిర్మాణం చేశారు. వీటిని వినియోగంలోకి తీసుకురాకుండానే నిరుపయోగంగా వదిలేశారు. ఈ నేపథ్యంలో కేటాయించిన నిధులు అరకొరగా ఖర్చు చేసి మిగిలినవి బొక్కేశారని విమర్శలు వినిపించేవి. అప్పటి నుంచి ఆ శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటంలేదు. కూటమి అధికారంలోకి కాగానే పర్యవేక్షకుని మార్పు... పర్యవేక్షకునిగా స్థానిక వ్యక్తిని నియమించి జీతం కేటాయిస్తున్నారు. అసలు ఇక్కడ సదుపాయాలే లేనప్పుడు జీతభత్యాలు ఎందుకు ఇస్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు వ్యక్తి స్థానంలో కూటమి పాలకులు తమకు అనుకూలమైన వ్యక్తికి మార్చుకున్నారు. ఇప్పుడు అనిత హోం మంత్రి కావడంతో నిధులు కేటాయింపు భారీగా ఉంటాయని స్థానిక కూటమి నాయకులు ఆశిస్తున్నప్పటికీ అటువంటి ఊసేలేదు. పైగా చేసిన పనులు పూర్తిగా శిథిలమయ్యాయి.

ఈ ప్రాంతంలో పర్యాటకులు తాకిడి కూడా రోజురోజుకు పెరుగుతున్నా వసతులు ఉండటం లేదని పెదవి విరుస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం వారు పర్యాటకులు సౌకర్యార్థం బీచ్ ఇసుక తిన్నెల్లో రెండు సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేక ఇవి పాడయ్యాయి. ప్రధానంగా ఇక్కడ మందుబాబులు తిష్ట వేసి పర్యాటకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తాగి పడేసి సీసాలు, వాటి పెంకులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మినీ కైలాస్ గిరి కొండపై ముళ్లపొదలు, పిచ్చితుప్పలు పెరిగి అసౌకర్యంగా తయారైంది. ఇప్పటికైనా తీరంలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.



సదుపాయాలు కల్పిస్తే అభివృద్ధి

తీరంలో నిత్యం పర్యాటకులు వస్తున్నారు. సదుపాయాలు కల్పిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలి. వచ్చిన పర్యాటకులు సదుపాయాలు కల్పిస్తే మరిన్ని సార్లు వచ్చి సేద తీరుతారు. తాను 10 ఏళ్లుగా బాబా మందిరంలో సేవలు అందిస్తున్నాను.
– చేపల సాయిరామ్, సాయిబాబా మందిరం పూజారి, రేవుపోలవరం



పనులు వదిలేయడం వల్ల నిధులు వృథా

పర్యాటక కేంద్రంలో నిత్యం గుర్రం, ఫొటో కెమెరాతో అందుబాటులో ఉంటూ జీవనాధారం చేసుకుంటాను. 15 ఏళ్లుగా ఇదే బీచ్‌లో ఉంటున్నాను. 6 ఏళ్ల క్రితం టూరిజం హంగులు వస్తాయని సంతోషించాం. చేపట్టిన పనులు మధ్యలో వదిలేయడం వల్ల నిధులు వృథా అయ్యాయి తప్ప ప్రయోజనం లేవు. ఇకనైనా పూర్తిస్థాయిలో చేపట్టాలి. – వాసుపల్లి అప్పన్న, రేవుపోలవరం

పౌర్ణమినాడు పోటెత్తిన ఉపమాక

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- కిటకిటలాడిన క్యూలైన్లు
- తెల్లవార్లు తిరునాళ్ల సందడి



మహాద్వారం నుంచి స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లో వెళ్తున్న భక్తులు



రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన షెడ్ల వద్ద సేద తీరుతున్న భక్తులు



ఆలయంలో మహిళల కోలాటం



శ్రీదేవీ,భూదేవీ సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామివారు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా పౌర్ణమి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. కల్యాణాన్ని తిలకించడానికి రాలేని వారంతా పౌర్ణమినాడు స్వామి దర్శనానికి తరలి వచ్చారు. స్వామివారి చక్రస్నానంతోపాటు భక్తులు సముద్ర స్నానమాచరించారు. అనంతరం గరుడాద్రి పర్వతంపై వెలసిన మూలవిరాట్‌ను దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ పర్యాయం ఎక్కువగా అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖపట్నం, గాజువాక, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడం విశేషం. మహా ద్వారానికి ఎదురుగా ఉన్న ఆర్చి నుంచి క్యూలో వేచి ఉన్నారు. టీటీడీ వారు ఏర్పాటు చేసిన క్యూకాంప్లెక్స్ ద్వారా వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు. గాలిగోపురానికి ఎదురుగా ఏర్పాటు చేసిన షెడ్లు, కార్పెట్లపై సేద తీరారు. పౌర్ణమి, హోళీ పండగ సెలవు దినం కావడంతో వేల సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఉపమాకలో ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద తిరునాళ్లు జరిగాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల వద్ద తమకు కావాల్సిన సామగ్రి, మసాలాదినుసులు, సుగంధద్రవ్యాలు, ఇత్తడి స్టీల్, సిల్వర్ సామగ్రి కొనుగోలు చేసుకున్నారు. ఆలయం వద్ద నిర్వహించిన కోలాటం, భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వారి హిందూ ధర్మప్రచార ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పౌర్ణమి సందర్భంగా ధ్వజస్తంభం ఎదురుగా కల్యాణ మండపలంలో ఉత్సవమూర్తులను ఉంచడంతో భక్తులంతా దర్శించుకున్నారు. ఇక్కడే పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. జాతీయ రహదారి నుంచి ఉపమాక వరకు ట్రాఫిక్ జాం, వాహనాల రాకపోకలతో ఉపమాక రోడ్డు కిటకిటలాడింది. సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

సాక్షి ఎఫెక్ట్..

ఎస్.రాయవరం: మండలంలో అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు శుక్రవారం తెలిపారు. యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో గత శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై మైన్స్ అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించారు. దార్లపూడి, పి. ధర్మవరం, అడ్డురోడ్డుకు చెందిన ట్రాక్టర్లు తరచూ ఇసుక రవాణా చేస్తున్నట్టు సమాచారం తెలుసుకున్న ఎస్.రాయవరం పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు రెండు ట్రాక్టర్లను విడివిడిగా పట్టుకుని సీజ్ చేసి అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయం వద్ద భద్రపరిచామని ఎస్ఐ తెలిపారు. వీటిపై మైన్స్ అధికారులు కేసు నమోదు చేస్తారన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే ఇకపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

కె.కోటపాడు: కింతాడ పంచాయతీ జోగన్నపాలెం నివాసి బండారు లక్ష్మి ఇంట్లో శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ అయి ఫ్రిజ్, గ్రైండర్, ఫ్యాన్‌లు, చీరలు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ సమయంలో భయంతో బయటికి పరుగులు తీశామని ఆమె తెలిపారు. సర్వస్వం కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలినట్టు పేర్కొంది. లక్ష్మి ఇంటిని స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ముత్యాలనాయుడు పరామర్శించి ఆమెను ఓదార్చారు. జరిగిన ఘటనను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాయపడాలని కోరనున్నట్లు ఆమెకు సర్పంచ్ ఈశ్వరమ్మ తెలిపారు.

21న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా

చోడవరం: చెరకు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 21వ తేదీన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా నిర్వహించేందుకు ప్రజా సంఘాలు, సీపీఎం, సీఐటీయూ అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చోడవరం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

నేడు రామాలయ ప్రారంభోత్సవం



వేదపండితులు కోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న దంపతులు



స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, సుభాషిణి దంపతులు

మునగపాక: స్థానిక దళితవాడలో శనివారం ఉదయం 10.28గంటలకు రామాలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం వేద పండితుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ మంత్రోచ్చారణల మధ్య ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. తప్పెటగుళ్ల, తోడపెద్దు సేవ గరిడీలు, నేల వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సుభాషిణి దంపతులు స్వామివారికి వస్త్రాలు సమర్పించారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న జాయింట్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జేవీ శివశంకర్

యలమంచిలి రూరల్: కార్మికుల భద్రతకు పరిశ్రమ యాజమాన్యం, ఉన్నతాధికారులు ప్రాధాన్యమివ్వాలని జాయింట్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జేవీ శివశంకర్ సూచించారు. మైహోమ్ సిమెంట్ కర్మాగారంలో ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బీకే సుధాకర్ హాజరై యాజమాన్యం, కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన భద్రతా నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్మికులంతా సేఫ్టీ నిమిత్తం అవసరమైన జాకెట్లు, ఇతర పరికరాలను ధరించాలన్నారు. అనంతరం భద్రతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మైహోం కర్మాగారం సీనియర్ జీఎం బీ రామస్వామి, సీనియర్ డీజీఎం (పీఅండ్ఏ) ఎల్ శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజర్(సేఫ్టీ) కే సతీష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ..



కోటవురట్లలో రంగులతో హోలీ జరుపుకుంటున్న పిల్లలు



మునగపాకలో హోలీ వేడుక

కోటవురట్ల/మునగపాక: హోలీ పండుగను శుక్రవారం వాడవాడలా ఉత్సాహంగా జరుపుకున్నారు. యువకులు, చిన్నారులు రంగులతో సందడి చేశారు. రంగు నీళ్ల చల్లుకుంటూ హోలీ పండుగను జరుపుకున్నారు. పలు వీధులు రంగులతో కనువిందుచేశాయి.

ఆగని అక్రమ గ్రావెల్ తరలింపు

పట్టించుకోని అధికారులు



పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డులో కొండను తవ్వేస్తున్న అక్రమార్కులు

మునగపాక: మండలంలో పలు చోట్ల గ్రావెల్ అక్రమ తరలింపుపై అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రిళ్ల అక్రమార్కులు ఇష్టానుసారంగా కొండలను తవ్వేస్తున్నా తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డులోనూ, తోటాడ త్రిమూర్తుల గుడి సమీపంలోనూ కొండలను పిండేస్తున్నారు. రాత్రి 11 నుంచి తెల్లవారు 3 గంటల లోపు గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైన్స్ అధికారుల నుంచి ఎటువంటి దాడులు కనిపించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణానికి హాని కలిగించేలా కొండలను పిండేస్తున్నా, చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ బాహాటంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాటిపల్లి పంచాయతీ పరిధిలోని అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అక్రమ గ్రావెల్ దందా నడుస్తుందంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు

చోడవరం: తీవ్రంగా గాయపరిచి వృద్ధుడి మృతికి కారకుడైన నిందితుడు నేమాల హరిని అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ అప్పలరాజు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 4వ తేదీన చోడవరం బాలాజీనగర్‌కు చెందిన ఇందల సన్యాసిరావు అనే వృద్ధుడితో బానీకోనేరుకు చెందిన నేమాల హరి ఘర్షణ పడి తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. సన్యాసిరావు తలకు బలమైన గాయమై విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12వ తేదీన మృతి చెందాడని సీఐ చెప్పారు. నిందితుడు హరిని చోడవరం ఐటీఐ కాలనీ సమీపంలో అరెస్టు చేసి కోర్టుకు తరలించామని సీఐ తెలిపారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించిందని ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



బోల్తా పడిన ట్రాక్టర్

నాతవరం: ప్రమాదశావత్తు ట్రాక్టర్ బోల్తా పడి సంఘటనా స్థలంలోనే డ్రైవర్ మరణించాడు. నాతవరం ఎస్ఐ సీహెచ్ భీమరాజు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామానికి చెందిన పెదపాత్రుని సత్యనారాయణ (59) శుక్రవారం సాయంత్రం తన గ్రామం నుంచి వరి గడ్డి ట్రాక్టరుపై నాతవరం మండలం గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం గ్రామానికి వచ్చాడు. ఈ గ్రామంలో వరి గడ్డి అన్‌లోడ్ చేసి తిరిగి స్వగ్రామం అల్లిపూడి ట్రాక్టరుపై వెళ్లిపోతున్నాడు. చిక్కుడుపాలెం గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి ట్రాక్టరు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ సంఘటనా స్థలంలోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పిల్లలు చదువుకుంటున్నారు. ఇంకా వివాహం కాలేదు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు బోరున విలపిస్తున్నారు. మృతుడి కుమార్తె నాగమణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.